

పరదాకబుర్లు చెప్పుకుంటున్నారు. ఇంతలో "బాబూ ! ధర్మం చేయండి" అని గుడ్డివాడు కర్ర సహాయంతో తడుముకుంటూ వారిముందుకు వచ్చాడు.

ఇద్దరు ముగ్గురు కుర్రాళ్లు విసుక్కున్నారు వాడ్ని చూసి—

"ఛీ—ఛీ—న్యూసెన్సు ఈ ఆడుక్కునేవాళ్ల తోటి — స్పెషల్గా ఈ గ్రుడ్డివాళ్లతోటి—అడుక్కున్నదిగాక మన కాళ్లే త్రొక్కిపోతారు" ఒక అధునాతన విద్యార్థి అన్న మాటలకు పెట్టెలోని అందరూ నవ్వారు.

శ్రీనివాసరావుగారు పేపరులోంచి తల ఎత్తి "ఇదిగో—బాబూ !" అంటూ పావలాకాసు జేబులోంచి తీసి గుడ్డివాడి పాత్రలో వేశారు. తడుముకుంటూ వచ్చి కాసు అందుకున్న ఆ గుడ్డివాడి ముఖాన్ని దగ్గర్నుంచి చూసారు ఆయన—ఎందుకో అది పరిచయమున్న ముఖంమాదిరి అన్పించింది ఆయనకు.

"—నేను ఏదో కథలో చదివాను—వీళ్ళు పుట్టు గుడ్డివాండ్లు కారట ! వీళ్ల తల్లులు భవిష్యత్తులో తమ పిల్లల బ్రతుకుతెరువుకోసం — కండ్లలో జిల్లేడుపాలు పిండి — గుడ్డివాండ్లలా చేస్తారట !" ఇంకొక కుర్రాడి మాటలను అందరూ ఆశ్చర్యంగా విన్నారు.

"నిజమేరా ! మా ఊళ్లో గుడ్డిపేరయ్య అనేవాడు ఉండేవాడు. వాడే చెబుతుంటాడు — తన తల్లే తనను గ్రుడ్డివాణ్ణి చేసిందని—ఇప్పుడు వాడు సుఖంగా బ్రతుకుతున్నాడు—" అని మరొక కుర్రాడు అందుకున్నాడు.

'గమ్మత్తయిన బ్రతుకుతెరువే!' అని శ్రీనివాసరావుగారి ప్రక్కన కూర్చున్నతను వ్యాఖ్యానించాడు—

మళ్లీ అందరూ నవ్వారు.

గుడ్డివాడిమీద చర్చ కాసెపు ఆగిపోయింది.

"బాబూ — ధర్మం" అని గుడ్డివాడు తన ఉనికిని మళ్లీ తెలియజేసాడు అందులోనివారికి—

శ్రీనివాసరావుగారిని కూర్చోమని చోటిచ్చిన విద్యార్థికి జాలివేసింది కాబోలు ! జేబిలోంచి రూపాయినోటు తీసి వాడి పాత్రలో వదిలి పెట్టాడు.

అక్కణ్ణించి వాడు కదిలి ఇంకొక విద్యార్థి ముందుకు తడుముకుంటూ వెళ్లి ధర్మం అడిగాడు.

'అందరికీ కలిసేనోయ్ — అతను వేసిన రూపాయి !' అని అతను జవాబిచ్చాడు. "అసలు నిజమైన గుడ్డేనా — నీకు" అని ఇంకొక అనుమానాలరాయుడు అడిగాడు.

'నిజమైందే' అన్నట్లుగా గుడ్డివాడు తలూపాడు.

"పుట్టుగుడ్డివా ?" అని మరొకడు ప్రశ్నించాడు.

'కాదు బాబూ !' అని వాడు జవాబిచ్చాడు.

సంస్కారమున్న మనిషిలా ఉన్నాడు వాడు — కుర్రవాండ్ల ప్రశ్నలకు విసుక్కోకుండా జవాబివ్వటం చూస్తుంటే శ్రీనివాసరావుగారికి జాలి కలిగింది వాడిమీద—అయినా గుడ్డివాడు విసుక్కొని మాత్రం ఏం చేయగలడు ?

'ఎట్లా పోయాయి నీ కండ్లు'—మళ్లీ ప్రశ్నలు మొదలయ్యాయి.

"నేను పూర్వజన్మలో చేసుకున్న పాపం బాబూ ! నా మిత్రుడికి తెలిసో—తెలియకనో చేసిన ద్రోహానికి ప్రతిఫలం ఇది—" అన్నాడు వాడు.

సంస్కారపూరితమైన వాడి మాటలకు అందరూ ఆకర్షింపబడ్డారు. కుర్రవాండ్లకు వాడి కళ్లు ఎలా పోయాయో తెలుసుకోవాలనే ఉత్సాహం బాగా ప్రబలి నాడి కథ చెప్పమని అందరూ బలవంతం చేసారు. గుడ్డివాడు తటపటాయించాడు.

'చెప్పు బాబూ !' అన్నాడు వక కుర్రాడు.

'మాక్కూడా కాలక్షేపం' ఇంకొకడు వంత పాడాడు.

శ్రీనివాసరావుగారి పేపరుపఠనం ఆగిపోయింది విస్మయంతో తలెత్తి వాడిని చూసారు.

గుడ్డివాడు చెప్పటం మొదలెట్టాడు.

*   *   *

"—బారుగా—పొడుగ్గా ఉన్న కట్టెపుల్లలనే కత్తులుగా ఎంచి యుద్ధం చేయటమంటే మాకు చెప్పలేనంత సరదా—అందులో మేముండే ప్రదేశమంతా ఎత్తాటి చెట్లతో నిండిఉండేది — జట్లు జట్లుగా చెట్లమీదికి ఎక్కి బారుగాఉన్న కొమ్మలను వంచి నిడుపాటి పుల్లలను కొట్టి — కత్తుల్లా వాటిని తయారుచేసేవాళ్లం !

మా ఇంటివెనక పెరట్లో భావి గచ్చు ప్రక్కన — పిచ్చి మొక్కలన్నీ మొలిచి పెద్ద అడివిలా తయారయ్యింది. వాటిని ఆనుకునే ప్రహారీ గోడ ఉండేది. దానికి నిచ్చెన వేసి—గోడ అంచుల వరకూ వెళ్లిగూడా చివరకు సాహసోపేతమయిన యుద్ధాలు చేసేవాళ్లం — అంతకంటే ఆనందం అప్పట్లో ఇంకొకటి మాకు ఉండేదిగాదు.

నేనూ—మా శంకరంచెల్లెలు సీతా ఎప్పుడూ వక జట్టు — యుద్ధంఆట మొదలుపెట్టబోయే ముందే షరతులన్నీ చెప్పేసేవాడ్ని—నే నెప్పుడూ యుద్ధంలో ఓడిపోగూడదు — సీతకంటె నాకింకొకరి సహాయం అనవసరం. ఆపదలో ఎవరైనా చిక్కుకుంటే వారిని రక్షించటానికి కత్తియుద్ధం నేనే చేయాలి ! వీ టన్నిటికీ నా మిత్రులు ఒప్పుకునేవాండ్లు—ఎందుచేతనంటే అంతకంటే మంచి పెరడు వాళ్లెవరి ఇండ్లలోనూ లేదు. నన్ను కాదని వాళ్లు ఇంకొకచోట ఆడుకోటానికి—

షరత్తులను ఉల్లంఘించినవాడిని ఆటలోంచి

—38 వ పేజీ చూడండి

గుడ్డివాడు

9 వ పేజీ తరువాయి

తీసేసేవాణ్ని—అంతకంటే దారుణమయిన శిక్షణ ఇంకొకటి ఉండేదిగాదు. ఏంచక్కా మేము కత్తుల్లాంటి కర్రలు తీసుకొని యుద్ధం చేస్తుంటే వా డొక్కడూ ఒక ప్రక్కగా దిక్కుదిక్కుమంటూ నిలబడి ఉండేవాడు. యుద్ధంలోనుంచి పారిపోయివచ్చిన సైనికుడిలా ఉండేది అప్పటి తీసేసినవాడి పరిస్థితి! ఆ శిక్షకు ఎప్పుడూ ఒప్పుకోకపోయేవాడు. అందుకే నే చెప్పినట్లు వినాల్సి వచ్చేది—

'శీను' ఎప్పుడూగూడా నాకు ప్రత్యర్థి—వాడు అప్పుడప్పుడూ నాతోటి ఓడిపోవటానికి ఒప్పుకోకపోయేవాడు—కాని మిత్రులంతా నాకు అండదండగా ఉండబట్టి వాడి ఆటలు ఏమీ సాగేవి కావు—

ఆటలో 'సీత' రాజకుమారి. నేను ఆమెను రక్షించే రాజకుమారుణ్ని—శీను ఆమెను బలాత్కారంగా గుంజుకొనిపోయి అడివిలో దాచే రాక్షసుడు. శంకరం—రంగడూ, చంద్రం—గిరీ—వీళ్లంతా వాడి అనుచరులు. నేను ఒక్కణ్ణీ సీతను శీనుచెర నుండి విడిపించుకొని రావాలి! అదీ ఆట!

గుర్రం పరుగుతీస్తున్నట్లుగా నోటితోనే శబ్దం చేసుకుంటూ మా భావి గచ్చుపలక చుట్టూ మూడుసార్లు తిరిగేవాణ్ని—అక్కణ్నించి గబుక్కున గుర్రాన్ని గంతు వేయించినట్లుగా—నేనే వేసి, దట్టంగా ఉన్న చెట్లచాటుకు వెళ్లి సీతకోసం వెతికేవాణ్ని. శీను ఎప్పుడూ వరి గడ్డివాము ప్రక్కనే ఉన్న చింతచెట్టుక్రిందనే సీతను పట్టుకొని కూర్చునేవాడు. నాకు తెలుసు వాడు అక్కడికి పోతే దొరుకుతాడని—కాని గబుక్కునపోయి రాక్షసుడితోటి కత్తియుద్ధంచేస్తే ఏం సరదా ఉంటుంది? అందుకే ఈ తతంగమంతా!

నేను శీనుతోటి 'కర్రయుద్ధం' చేస్తుంటే వాడికి అండగా తతిమ్మా సావాసగాండ్రంతా ఉండేవారు. నేను సీతను తీసుకొని వెళ్లకుండా చూడటమే వాళ్ల లక్ష్యం! కానీ ధర్మం తప్పకుండా గెలవాలికాబట్టి—నేనే అందర్నీ ఓడించేవాడిని. ఆటుతర్వాత అంతా గలిసి శంకరంగాడు ఇంటి నుంచి దొంగిలించుకొని వచ్చిన దోసకాయలను ముక్కలుగా తరిగి—ఉప్పూ కారంలో నంచుకొని తినేవాళ్లం!

ఇది ఈ. చా. తప్పకుండా సాయంత్రం నాల్గింటి నుంచి ప్రతిరోజూ జరగాల్సిన మా మిత్రబృంద కార్యక్రమం. ఎప్పుడోతప్ప అందరం 'కత్తి యుద్ధం ఆట' తప్పనిసరిగా ఆడేవాళ్లం. శీను ఇల్లు మా ఇంటి ప్రక్కనే ఉండేది. వాడు స్కూలు ఒదిలిపెట్టేసరికి ఖచ్చితంగా మా ఇంటికి హాజరయ్యేవాడు. వాడి వెనుకగా తతిమ్మావాళ్లంతా అటు ఇటూ తేడాతో చేరేవాండ్లు.

ఇహ రేపు ఉగాదిపండుగనగా బడిలో తెలుగు మాష్టారుగారు పద్యం ఒప్పచెప్పనందుకు తాట ఊడేలా పేంబెత్తంతో నన్ను కొట్టారు! క్రితంరోజు రాత్రి 'స్టంటు సినిమా' కు దొంగతనంగా నేనూ—శీనూ వెళ్లినందుకు ప్రతిఫలం అది—'కత్తియుద్ధం'ఆటలో నేను అందర్నీ ఉత్తుత్తిగా ఓడించినా నిజజీవితంలో నా అంతగా భయపడేవాడు మరొకడు ఉండేవాడు కాదు. క్లాసులో మాష్టరుగారు పాఠం ఒప్ప చెప్పనందుకు ఎంతగా బాదుతాడో అని నాకు తెగ భయమేసేది.

అందుకే అన్ని ఆటలు అయినతరువాత సాయంత్రం చక్కగా స్నానంచేసి—పెరుగేసుకొని అన్నంతిని — బుడ్డిదీపంముందర పుస్తకాలు వేసుకొని కూర్చునేవాడిని. అర్ధగంట పాఠం చదివానంటే ఇహ నేను దాన్ని మరిచిపోయేవాడ్ని కాదు. అంత జ్ఞాపకశక్తి ఉండేది.

అవ్వాళ పాఠం రానందుకు దెబ్బలుతిన్న భయం ఇంకా నా మనస్సులో మెదుల్తుండబట్టి స్కూలు విడిచిపెట్టగానే వచ్చి బుద్ధిగా స్నానంచేసి అమ్మ పెట్టిన కారప్పూస కరకర నములుతూ తెలుగు శతకం ముందరేసుకొని కూర్చున్నాను.

మా అమ్మ వంటింట్లో పండుగకోసం పిండి వంటల తయారీతో సతమతమవుతున్నది. నాన్న అప్పుడే ఆఫీసునుంచి వచ్చి వరాండాలో కూర్చొని బావతో మాట్లాడుతున్నాడు. బావా—అక్కా అవాళ్టి ప్రొద్దుటిబండికి వచ్చారు. పండుగ వాసనలతో మా ఇల్లు గమగమ లాడుతూ ఉన్నది.

శీను వచ్చాడు. వాడొక్కడేగాదు—వాడితో పదిమంది. నాకు తెలుసు వాళ్లు ఎందుకు వచ్చారో? కానీ నేను ఆపూట ఆటకు వెళ్లదల్చుకోలేదు.'రాన'ని—ఖచ్చితంగా చెప్పాను. శీను నన్ను బలవంతంచేశాడు. ఈ రెండురోజులూ శలవులేకాబట్టి తర్వాత చదువుకోవచ్చు అన్నాడు. నేను ఒప్పుకోలేదు. ఈ రభసంతా ప్రక్కన వంటింట్లో అమ్మ వింటున్నదికాబోలు! నన్ను పిలిచి నవ్వుతూ—'ఎన్నడూ లేని బుద్ధి ఇవ్వాళనే నీకు వచ్చిందేమిట్రా! రాత్రి చదువుకోవచ్చు! వెళ్లు—పాపం! వాళ్లు అంతగా బ్రతిమిలాడుతుంటే—" అన్నది.

నాకు తప్పిందికాదు—ఆపూట 'కత్తి ఆట' ఆడటానికి వీలుపడిందికాదు—మా పాలేర్లు—సన్నగా చెక్కివున్న మా కత్తులమీద మోజుపడి గొడ్లను మళ్లించటానికి తీసుకుపోయారు. అందుచేత 'కోతి కొమ్మంచి' మొదలెట్టాం. గమ్మత్తుగా ఉండే 'కత్తి ఆట' మీదికి 'కోతి కొమ్మంచి' ఏం వస్తుంది? అందుకే ఆ ఆట ఆడుతున్నామనేగాని—మాక్కు రుచించలేదు. పైగా శంకరం చెట్టుమీదినుంచి బోర్లపడ్డాడు. పెద్దగా గాయమయితే కాలేదుగానీ నెత్తురు వచ్చింది.

నాకు రక్తం చూసేసరికి భయమేసింది—ఆట ఆపుచేసాం. కుంటుకుంటూ శంకరం ఇంటికి వెళ్లాడు. వాడి కుంటినడకను చూసి అందరూ ఫకాల్న నవ్వారు. నాకు ఎందుకో దిగులనిపించింది. 'ఇంక నయమే—వాడి కాలు విరగలేదు'—అనే భావం నా మనస్సులో ఉదయించి కాస్త తృప్తికల్గింది.

శీను 'ఇంటికి' వెళ్తూ వెళ్తూ నా చెవిలో 'రేపు శలవే కాబట్టి కత్తిఆట ఆడుకుందాం' అన్నాడు—నేను 'సరే' నన్నాను.

రెండోరోజు ఉదయం పక్కమీంచి లేస్తుండగానే నాకు శీను చెప్పిన సంగతి జ్ఞాపకం వచ్చింది. కత్తిఆట ప్రోగ్రాం ఉంది కాబట్టి, ఎక్కడలేని ఉత్సాహంతో కాలకృత్యాలు పూర్తిచేసుకుని అమ్మ దగ్గరికి వెళ్లాను. అమ్మ కాఫీ ఇచ్చి—'సారథీ—నీవూ, అక్కా వెళ్లి శీను నాన్నగారినీ, అమ్మనూ భోజనానికి పిలవాలిరా!" అన్నది. నాకు తెగ సంతోషమేసింది. శీనుతో ఏంచక్కా ఇవ్వాళ్లా మా ఇంట్లోనే ఎగరవచ్చు!!

చనిపోతూ ఒక మాజీ లత్తాధికారి విల్లు ఇలా రాశాడు. "నాకు ఆస్తిపాస్తులుండేవి. అన్నీ హారతి కర్పూరం అయిపోయాయి. ఇక ఈ భూమిని మాత్రం ప్రపంచంలోని ప్రజలందరికీ వదిలిపోతున్నాను."

ఆర్. మల్లయ్య (మద్రాసు)

ఒక్క పరుగుతో శీను ఇంటికి చేరుకున్నాను. ఆ ఇంట్లో కొంచెం నాకు చనువుగూడా! ఎగురుతూ ఉత్సాహంగా 'ఇవ్వాళ మీరంతా మా ఇంటికే నండోయ్—భోజనానికి!' అని అందరితో చెప్పేసాను. వెనగ్గా వచ్చిన మా అక్క ముసిముసి నవ్వుతో శీను అమ్మకు అసలుసంగతి చెప్పింది—'అవ్వాళ బాబిగాడి పుట్టినరోజుపండుగకూడా కల్సివచ్చింది కాబట్టి అందరం సంతోషంగా మా ఇంట్లోనే పండుగ జరుపుకోవాలని—

పదిగంట లయ్యేసరికి శీనుకుటుంబమంతా మా ఇంటికి తరలి వచ్చింది. మా ఇంట్లో కోలాహలం అంతా ఇంతా గాదు.

ఫలహారా లయినతరువాత నేనూ—శీనూ గల్సి మిత్రులందర్నీ పిల్చుకొని వచ్చాం! మా చెట్లమీదికి ఎక్కి పొడుగాటి కర్రలు విరిచి—వాటిని సన్నగా చెక్కి కత్తుల్లా తయారుచేసాం!

ఇహ ఆట మొదలుపెట్టాం!

ఎప్పటిలాగానే నా ఉత్తుత్తిగుర్రంతో శీను దాక్కున్న చింతచెట్టుకిందికి చేరుకున్నాను.—'దుర్మార్గుడా—ద్రోహీ' అంటూ శీనుమీద అమాంతం పడి మొదట కలబడ్డాను. తరువాత కర్రకత్తులతో అసలుయుద్ధం ప్రారంభించాం! శీనుకు సహాయంగా పదిమంది చేరారు. నే నొక్కణ్ణే—ధైర్యంగా అందర్నీ ఎదుర్కొని పోరాడుతున్నట్లు నటిస్తున్నాను. గుండ్రంగా తిరుగుతూ దెబ్బకు దెబ్బ తీసాను. అందరూ నా ధాటికి ఆగలేక పారిపోయారు. శీను ఒక్కడే మిగిలాడు—నేను హీరోలా పండ్లు కొరుకుతూ వాడిమీద పడి—ద్రోహీ! నీవు చేసిన పాపానికి ప్రతిఫలం ఇదే!" అంటూ గభాల్న కర్రకత్తితో పొడవబోయాను. వాడికి నా యాక్షనుకు నవ్వువచ్చి వంగిఉన్నవాడల్లా పైకి లేచాడు. అంతే!

నా కర్ర వాడి కండ్లల్లో గుచ్చుకుంది—'అమ్మో' అని వాడు బాధగా కేకేసి బిర్రబిగుసుక పోయాడు.

నేను ఏం చేసాను? ఏమి టీ దారుణం!?

నాకేమీ అర్థంగాలేదు. నా కాళ్లు భయంతో బిగుసుకపోయాయి! నేను వణికిపోయాను.

వాడి కేకకు ఇంటిముందున్నవారంతా ఉరుకులు పరుగులతో దొడ్లోకి వచ్చారు.

శీను కంటిగుడ్డువెంబడి నీళ్లు కారుతున్నాయి! ఏం జరిగిందో ఎవరికీ అర్థంగాలేదు. నన్ను నిలదీసి అడిగారు. నేను మాట్లాడలేకపోయాను. వళ్లంతా చెమటలతో తడిసిపోయింది.

మా నాన్న 'మాట్లాడవేంరా?' అంటూ నా చెంపమీద ఛెళ్లుమనిపించాడు. వెక్కుతూ జరిగిన సంగతి చెప్పాను. 'పెద్ద ఘోరంచేసినట్లుగా అందరూ నావైపు అసహ్యంగా చూసారు.

మా నాన్నకు కోపం కట్టలు తెంచుకొని వచ్చింది. నామీదపడి ఇష్టం వచ్చినట్లు బాదాడు. నేను అడ్డు చెప్పలేదు—నేను ఘోరం చేసాను?

శీనుకు కన్ను పోయింది— శీను గుడ్డివాడయ్యాడు! అక్కడివా రందరూ అదే తీర్మానించారు. శీనుఅమ్మను చూస్తుంటే నాకు ఏడుపు ఆగలేదు. ఆమె వాడిమీద పడి పెద్దగా శోకాలుపెడుతున్నది. శీను నాన్న ఏమీ మాట్లాడలేదు కానీ నావైపు ఛీత్కారంగా చూసాడు. మా నాన్న 'తుపుక్కున' నామీద ఉమ్మేసి శీనును తీసుకొని ఆదరాబాదరా హాస్పిటల్‌కు వెళ్లారు. ఆయన వెంబడి ఆదుర్దా నిండిన హృదయాలతో అందరూ వెళ్లారు. నేనూ—మా అమ్మా, అక్కా—అక్కడ మిగిలిపోయాం!

నేను ఏడుస్తూ అక్కడ నిలబడ్డాను.

అమ్మ నావైపు అసహ్యంగా చూసి—'ఎందుకు నాయనా—ఇంకా ఏడుస్తున్నావ్! నిష్కారణంగా బంగారంలాంటి పిల్లగాడి కండ్లు పొట్టన బెట్టుకొని—ఏమవుతుందో—ఏంపాడో?" అనుకుంటూ అక్కతోసహా ఇంట్లోకి వెళ్లింది.

పూవు మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదీన్నీ, మీ సరియైన దర్యనుగురించిన్నీ మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన మీకు యిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, మీ సరియైన చిరునామా యున్నూ వెంటనే వ్రాసి పంపండి.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసిన తేదీలగాయతు 12 మాసములలోను మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో మీకు జయము కలుగునో, మీ ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభము మొదలగు వానినిగురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-25 న. పై.లకు మాత్రమే వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవయినా వున్నయెడల శాంతిచేయు విధానంకూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Pt. Dev Dutt Shastri, Raj Jyothishi (W. P.) JULLUNDUR CITY.

గుడ్డివాడు

నేను ఒక్కణ్ణే అక్కడ మిగిలిపోయాను.

నా ఒళ్లు వేడెక్కింది.

నన్ను పోలీసులు పట్టుకోబోతారు—జైల్లో వేస్తారు. అదే నా అప్పటి పన్నెండేళ్ల మెదడులోకి జొరబడిన భావం!

నా హృదయం బండరాయిగా మారింది. ఆ ఇంట్లో ఉండగూడదనుకొని నిశ్చయించుకొన్నాను. పెరటిగుమ్మం తలుపులు తెరచుకొని నెమ్మదిగా రైల్వేస్టేషనుకు చేరుకున్నాను—రైలు ఆగివుంది. అందులోకి ఎక్కి కూర్చున్నాను. రైలు కదిలింది—మా ఊరూ—మా పరిసరాలు మొత్తం దూరంకాజొచ్చాయి—చివరకు అవి శాశ్వతంగా దూరం అయ్యాయి!" శీనును గుడ్డివాడిగా చూస్తూ పదే పదే గుర్తుకువచ్చే నా పాపంతో అక్కడ బ్రతకలేనుకూడా. ఇహ అదే చివరిసారిగా ఆ ఊరిని చూడటం—"

* * *

రైయిను పరుగులుతీస్తుంటే గుడ్డివాడు చెప్పిన కథనం అందరూ విన్నారు.

రెండు నిముషాలు పెట్టెంతా నిశ్శబ్దంగా ఉన్నది.

'హంబక్!' అని గట్టిగా విద్యార్థులలో ఒకడు అరిచాడు.

—కొందరు నవ్వారు. శ్రీనివాసరావుగారికి నవ్వు రాలేదు. కండ్లజోడు పెట్టుకున్న ఆయన కండ్లకు గిర్రున నీళ్లు తిరిగాయి.

"మరి మీ శీనుకండ్లు పోయాయి గానీ — నీవి కావుగా. ఉత్తుత్తి కత్తియుద్ధంలాగానే—ఉత్తుత్తి గుడ్డివాడి ఆట ఆడుతున్నావా?" ఇంకొక పిల్లగాడు పరిహాసంగా అడిగాడు.

అంతా తెగ నవ్వారు!

"ఏమిటో బాబూ! చిన్నతనపు పిచ్చి వైరాగ్యం—ఇప్పుడు నాకే నవ్వు వస్తున్నది—తలుచుకుంటుంటే.—మా అమ్మ అంటుండేది చేసిన తప్పుకు శిక్ష అనుభవించాలని. అందుకే నా కండ్లలో జిల్లేడుపాలు పిండుకున్నాను. అనుమానంగా ఉంటే మీరే చూడండి" అంటూ కూరుకుపోయిన రెప్పలను బలవంతాన పైకి గుంజాడు.

అవి అచ్చమైన గుడ్డికళ్లు!!

పెట్టెలోనివాండ్లందరూ కాస్త బిత్తరపోయారు—గుడ్డివాణ్ణి పరిహాసం పట్టించినందుకు. వాడిమీద అప్పటికి జాలి కలిగినట్లుంది—అందరూ తృణమో ఫణమో ముట్టచెప్పారు.

రైయిను ఆగింది. వాడు తడుముకుంటూ పెట్టె దిగి స్టేషనులోని గుంపులో కల్సిపోతున్నాడు—

శ్రీనివాసరావుగారు పిచ్చిగా అరిచారు.

"సారధీ! నీ శీనుకు కండ్లు పోలేదు—నేనే మీ శీనును" అని—

పెట్టెలోనివాండ్లు నివ్వెరపోయారు!

—అప్పటికే గుడ్డివాడు చాలాదూరం వెళ్లిపోయాడు— ★